క్లుప్తంగా

ఉత్సవాలకు హాజరుకండి



మంత్రి హరీశ్‌రావుతో వర్గల్ ఆలయ ప్రతినిధులు

వర్గల్(గజ్వేల్): ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న వర్గల్ శ్రీవిద్యాధరి శరన్నవరాత్రోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ బుధవారం ఆలయ కమిటీ ప్రతినిధులు మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానపత్రిక అందజేశారు. అదేవిధంగా ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, సీపీ శ్వేత తదితరులకు అందజేశారు.

టెండర్ల ఆహ్వానం



మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

హుస్నాబాద్: పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలో నూతనంగా నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని గదుల అద్దె కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ బుధవారం తెలిపారు. కాంప్లెక్స్‌లోని మూడు అంతస్తులలో (జీ ప్లస్ 2) మొత్తం 20 గదులకు (ఫిక్స్‌డ్ రేట్) అద్దె ప్రాతిపదికన ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడేళ్ల కాల పరిమితితో బాక్స్ టెండర్ ద్వారా గదులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బాక్స్ టెండర్ ద్వారా గదులు కేటాయించనున్నట్లు చెప్పారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

హుస్నాబాద్: 2023 సంవత్సరానికి గాను ఎంహెచ్‌ఆర్‌డీ మెరిట్ స్కాలర్‌షిప్‌కు 10 మంది విద్యార్థినులు అర్హత సాధించినట్లు ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ నల్లా రాంచంద్రారెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన గుంటిపెల్లి అశ్విత, పిట్టల సుస్మిత, గొర్ల వైష్ణవి, పోశవేని అఖిల, కాపర్తి కల్యాణి, గట్టు అక్షయ, నాగవెల్లి స్నిగ్ధ, మారబోయిన సమీరా, శ్రీవాణి, మహ్మద్ ఆసియా నౌషిన్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించినట్లు చెప్పారు.
దౌల్తాబాద్(దుబ్బాక): దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసుకున్న విద్యార్థులు వర్ష, అరవింద్ నేషనల్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి తెలిపారు.

గిరిజన సంక్షేమ కార్యాలయం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మోహన్ నాయక్

హుస్నాబాద్: గిరిజనుల జనాభా అత్యధికంగా ఉన్న హుస్నాబాద్‌లో మినీ గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సునావత్ మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో హుస్నాబాద్‌ను కలిపాక గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయానికి వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. తొమ్మిదేళ్లు గడిచిన హుస్నాబాద్‌లో గిరిజన భవన్‌ను పూర్తి చేయలేదన్నారు. సమావేశంలో ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్ నాయక్, అక్కన్నపేట మండల అధ్యక్షుడు అనిల్ కుమార్, నాయకులు పవన్ , కళ్యాణ్, సాయి, కృష్ణ తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా వ్యర్థాల పారబోత



తిమ్మాపూర్ రోడ్డు పక్కన వ్యర్థ జలాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్ సమీపంలోని రోడ్డు పక్కన పౌల్ట్రీ బాయిలర్ ఫాం నుంచి తీసుకొస్తున్న వ్యర్థ జలాలు పారబోస్తున్నారు. దీంతో దుర్వాసనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాంనగర్ చౌరస్తా నుంచి తిమ్మాపూర్ వరకు రోడ్డుకు ఓ వైపు వ్యర్థ జలాలను రాత్రి సమయంలో పారబోస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మూడోసారి బీఆర్‌ఎస్‌దే అధికారం

- హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్
- ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్ల పరిశీలన



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 105 సీట్లతో మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని సబ్‌స్టేషన్ సమీపంలో ఈనెల 15న నిర్వహించే కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లక్ష మందితో నిర్వహించే ప్రజా సభకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. స్టేజీ పక్కనే హెలిప్యాడ్ ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. హుస్నాబాద్ అంటే కేసీఆర్‌కు సెంటిమెంట్ అని.. ఇక్కడే రెండు సార్లు ఎన్నికల ప్రచారం ప్రారంభించారని పేర్కొన్నారు. అదే నమ్మకంతో మూడోసారి ఇక్కడి నుంచే ఎన్నికల శంఖారావం పూరించబోతున్నారని చెప్పారు. సభకు ప్రజలు భారీగా వచ్చేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి, విజయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు: సీపీ శ్వేత

కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను బుధవారం సీపీ శ్వేత పరిశీలించారు. వేదిక ఏర్పాటు చేసే స్థల, హెలిప్యాడ్ నిర్మాణం, సభకు వచ్చే వాహనాల పార్కింగ్‌పై పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ సతీష్, సీఐ కిరణ్, ఎస్సై మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల రక్షణకు అండగా నిలవాలి



మాట్లాడుతున్న జడ్జి సౌమ్య

గజ్వేల్‌రూరల్: సమాజంలో బాలికల రక్షణకు అండగా నిలిచి, వారు హక్కులు సాధించుకునేలా చేయూతనివ్వాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో భాగంగా పట్టణంలోని సేయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి పాల్గొన్నారు. ఈసందర్భంగా బాలలకు పోక్సో, లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే చట్టం, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిన నర్సింలు, ఎస్ఐ యాదగిరి, పాఠశాల హెచ్ఎం బ్రిగ్గిట్, మండల్ లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహాచారి, యామిని, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మద్దూరు(హుస్నాబాద్): ఎన్నికల నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మద్దూరు, దూల్మిట్ట అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు అనంత రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ షేక్ యూనుస్ మహ్మద్ అలీ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఆర్వోలు, ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో రాజకీయ పార్టీల వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్‌లను వెంటనే తొలగించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మద్దూరు, దూల్మిట్ట ఎంపీడీఓలు శ్రీనివాస్‌గౌడ్, రాంప్రసాద్, ఎంపిఓ ఖాజామోహినుద్దీన్, ఏఎస్ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎన్నికల నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు తప్పవని ఫ్లైయింగ్ స్క్వాడ్ మల్లేశం అన్నారు. మండలంలోని ధర్మారం వద్ద బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 50 వేల పైన ఎవరైనా వాహనాల్లో తరలిస్తే రసీదు తప్పనిసరిగా ఉండాలన్నారు. సరైన పత్రాలు లేకుండా డబ్బులు తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

మాకేది 'దళిత బంధు'

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్‌కు చెందిన పలువురు దళితులు బుధవారం దళితబంధు ఇవ్వాలని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎంపీడీఓ రామును కలిసి వివరించారు. దళితబంధు, గృహలక్ష్మి, కార్పొరేషన్ రుణాలు అందించి న్యాయం చేయాలని కోరారు.



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దళితుల నిరసన

'పల్లా'కు ఓట్లడిగే హక్కులేదు



మాట్లాడుతున్న సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ జీఓ తీసుకొస్తానని హామీ ఇచ్చి ఒట్టి చేతులతో వచ్చిన బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఓట్లడిగే హక్కు లేదని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. స్థానికేతర నాయకులతో ఈప్రాంతానికి న్యాయం జరగదని పేర్కొన్నారు. సమావేశంలో కృష్ణారెడ్డి, రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి'

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఎందుకు ప్రకటించడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని చేర్యాల రెవెన్యూ డివిజన్ ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి చెట్కూరి కమలాకర్ యాదవ్ ప్రశ్నించారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన అఖిల పక్ష బంద్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మహేందర్, భాస్కర్, మహిపాల్, రమేష్, పాల్గొన్నారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రాయపోలు(దుబ్బాక)/మిరుదొడ్డి/తొగుట: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని వడ్డేపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు బీజేపీలో చేరారు. ఈసందర్భంగా వారిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు బీజేపీతోనే న్యాయం చేకూరుతు ందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, నాయకులు రాజాగౌడ్, మహేశ్‌గౌడ్, కనకరాజు, పరశురాములు, కృష్ణ, యాదగిరి, నవీన్, గణేశ్, శ్రీకాంత్, చందు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మిరుదొడ్డి ఉపసర్పంచ్ ముక్కపల్లి కనకయ్యతో పాటు నలుగురు వార్డు సభ్యులు బీజేపీలో చేరారు. తొగుట మండలం చందాపూర్ సర్పంచ్ బొడ్డు నర్సింలు యాదవ్, తొగుటకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి అంజయ్య బీజేపీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రం, నాయకులు స్వామిరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చెరువు కట్ట.. మందుబాబులకు అడ్డా



మందుబాబులు పగులగొట్టిన మద్యం సీసాలు

దుబ్బాక: దుబ్బాక పెద్ద చెరువు కట్ట మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రి సమయంలో విచ్చలవిడిగా మద్యం సేవించి సీసాలు పగులగొడుతున్నారు. దీంతో ఉదయం వాకింగ్ చేసే వారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

దుబ్బాక: అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని అదనపు కలెక్టర్, ఆర్ఓ గరిమా అగర్వాల్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఐఓసీ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారికి ఎన్నికల విధుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. అనంతరం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్, నియమ నిబంధనల గురించి వివరించారు. సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారి చంద్రశేఖర్, ఎఈఆర్ఓ వెంకట్‌రెడ్డి, సుజాత, దివ్య, జయంత్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మరు

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ముదిరాజు సంఘం నాయకులు

దుబ్బాకటౌన్: కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్ని కపటనాటకాలు ఆడిన ప్రజలు నమ్మరని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ఎదురులేదని.. మూడోసారి సీఎం కేసీఆరే అన్నారు. ముదిరాజులు మొదటి నుంచి బీఆర్‌ఎస్‌కు అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. ఆశీర్వదించి గెలిపిస్తే అండగా ఉండి అభివృద్ధి చేస్తానన్నారు. రఘునందన్‌రావుకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ముదిరాజు సంఘం నాయకులు మాడవైన రాజు, దేవుని రాజు, మునేందర్, రాములు, మల్లయ్య, తోట్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు. అలాగే దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లి 50వ బూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుచారి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ప్రతిభతోనే సమాజంలో గుర్తింపు



విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను తిలకిస్తున్న ఏసీపీ రమేష్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తమలోని ప్రతిభను చాటినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని గజ్వేల్ ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల సేయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో బుధవారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ జానకీరాంరెడ్డితో కలిసి విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను తిలకించారు. అనంతరం ఏసీపీ రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి, సీబీఎస్ఈ ప్రిన్సిపాల్ విజయపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం



కొమురవెల్లిలో మూసి ఉన్న వ్యాపార సంస్థలు

కొమురవెల్లి(సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ సోమవారం నిర్వహించిన బంద్ విజయవంతం అయింది. మండలంలోని వ్యాపారసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతోనే చేర్యాల అభివృద్ధి సాధ్యమౌతుందని, లేదంటే వెనుకబాటుకు గురవుతుందని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. బంద్‌కు సహకరించిన వారికి జేఏసీ నాయకులు, రాములుచారి, గురువయ్యగౌడ్, శెట్టిపల్లి సత్తిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

కొండపాక బీఆర్‌ఎస్‌లో ముసలం

వెలికట్ట క్రాస్ వద్ద అసమ్మతి నాయకుల సమావేశం



సమావేశంలో బీఆర్‌ఎస్ అసమ్మతి నాయకులు

కొండపాక(గజ్వేల్): ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్‌ఎస్ నాయకులు అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. మండల పరిధిలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద బుధవారం కొన్ని గ్రామాల నాయకులు సమావేశమయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న వారిని గుర్తించకపోవడంతో పాటు కొత్తగా పార్టీలో చేరే వారికి పదవులు కట్టబెడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. పార్టీ మద్దతుతో స్థానిక ప్రజాప్రతినిధులుగా గెలుపొందినప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎవరిని కలవాలో తెలియక ప్రజల్లో చులకన అవుతున్నామని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పర్యాయాలు గజ్వేల్ ఎమ్మెల్యేగా సీఎం కేసీఆర్‌ను గెలుపించుకున్నప్పటికీ ఒక్కసారి కూడా ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల సమస్యలు అడిగిన పాపాన పోలేదని వా పోయారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజాప్రతినిధుల అవసరం ఉందా అని ప్రశ్నించారు. పార్టీ ఏర్పాటు చేసే అధికారిక సమావేశాల నిర్వహణకు ఇతర చోట్ల వారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం ఏమిటని పేర్కొన్నారు. త్వరలో మరికొందరి అభిప్రాయం తీసుకొని కార్యాచరణ వెల్లడిస్తామని స్పష్టం చేశారు. ఇటీవల బందారంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు వెళ్లిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులను గ్రామంలోకి రాకుండా అడ్డుకున్న విషయం తెలిసిందే. అధిష్టానం అసమ్మతి నాయకుల నిర్ణయాన్ని గుర్తించి అడ్డుకట్ట వేయని పక్షంలో పార్టీకి కొంత నష్టం జరిగే అవకాశం లేకపోలేదు. పార్టీకి పట్టున్న కొండపాక మండలంలో అసమ్మతి లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత పార్టీ పెద్దలపై ఉందని పలువురు పేర్కొంటున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు**



మద్దూరు(హుస్నాబాద్): జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థిగా పల్లాను ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో బుధవారం బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఫ్లెక్సీలు తొలగించాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకుల ఫ్లెక్సీలను తొలగించాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించారు. ఎన్నికల అధికారులు ఫ్లెక్సీలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మధు, గయాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

◆ **హెల్త్ కేర్ ట్రస్టు ఏర్పాటుపై హర్షం**

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల వైద్యం కోసం ఈహెచ్‌టీసీ ఏర్పాటు చేయడంపై తెలంగాణ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు కోతి యాదగిరి, బండారు ఎల్లయ్య బుధవారం హర్షం వ్యక్తం చేశారు.

◆ **కాంగ్రెస్ గెలుపు ఖాయం**



బెజ్జంకి(సిద్దిపేట): ప్రజల ఆశీర్వాదంతోనే ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేపడుతామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బెజ్జంకిలో బుధవారం వారు మాట్లాడుతూ.. మానకొండూర్‌లో కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గెలిపిస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, రాములు, శ్రీకాంత్, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, రవి, డీవీరావు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

◆ **సభను జయప్రదం చేయండి**

కోహెడ(హుస్నాబాద్): హుస్నాబాద్‌లో ఈనెల 15న నిర్వహించే ఎన్నికల శంఖారావం సభను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్కే శర్మ పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో కర్ర శ్రీహరి, కోహెడ ఫ్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు, కొక్కుల సురేశ్, శ్రీకాంత్, మధుసూదన్‌రావు, లక్ష్మయ్య, సంజీవ రెడ్డి, ఆవుల మహేందర్, రవీందర్, కుమారస్వామి పాల్గొన్నారు.

◆ **ఏసీపీని బదిలీ చేయాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట ఏసీపీ సురేందర్ రెడ్డిని బదిలీ చేయాలని బీజేపీ జిల్లా నాయకులు కొత్తపల్లి వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సిద్దిపేటలో నూతన రైల్వేలైన్ ప్రారంభోత్సవం సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలో బీజేపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారన్నారు. బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఏసీపీ వ్యవహరిస్తున్నారని వాపోయారు.

◆ **వాటర్ బాటిళ్ల పంపిణీ**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం సర్పంచ్ అన్నాడి సత్యనారాయణరెడ్డి స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొమిరె మల్లేశం, హెచ్ఎం, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఏకగ్రీవ ఎన్నిక**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సిద్దిపేట టౌన్ కన్వీనర్‌గా తోర్ల రాజు మాదిగను ఎన్నుకున్నారు. బుధవారం పట్టణంలో ఎంఆర్‌పీఎస్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ రాజు మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

◆ **వ్యక్తిపై కేసు నమోదు**

కొండపాక(గజ్వేల్): అక్రమంగా మద్యం అమ్ముతూ పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. మండల పరిధిలోని దుద్దెడలో కొందరు అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు బుధవారం ఏఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించగా.. పెద్దంకుల నరేందర్ ఇంట్లో అక్రమంగా 22 లీటర్ల మద్యం పట్టుకున్నట్టు తెలిపారు. ఏఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.